# బస్సులో బ్యూటీ

## -మారగాని రాంబాబు

వేగంగా సాగిపోతోంది డీలక్స్ బస్సు. అంతవరకూ పడి వెలిసిన వర్షంలో తడిసిన ప్రకృతి అందాలను తిలకిస్తున్నాడు శ్రీ కిరణ్.



అంతలోనే 'ఎక్స్‌క్యూజ్ మీ' అన్న తీయని పిలుపు విని అటు చూశాడు. ఓ అద్భుత సౌందర్యరాశి నిలుచుంది ప్రక్కనే లగేజితో. ఆమె ఎప్పుడు ఎక్కడ ఏ స్టేజీలో ఎక్కిందో అతడు గమనించలేదు.

ఒక్కసారి చూస్తే - తలప్రక్కకి తిప్పనివ్వని అందం ఆమెది. ఆమెనే చూస్తూండి పోయాడు కిరణ్.

"ప్లీజ్ కొంచెం సీటిస్తారా!" అన్న ఆమె మాటకు "యాఁ... యా హూఁ" అంటూ ఆనందంగా అరిచేవారే ఇంకొకరైతే, కానీ శ్రీ కిరణ్ ఇక తప్పదన్నట్లుగా ఇబ్బందిగా ఫీలవుతూ ప్రక్కకి జరిగాడు. ఆమె లగేజీ సర్ది కూర్చుంది.

కూర్చున్న కొద్ది క్షణాల్లోనే "మీకేమైనా ఇబ్బంది కల్గిస్తున్నానేమో!" అంది మృదువుగా.

"ఇబ్బంది అంటే ఇబ్బందే! కాని ఏం చేస్తాం తప్పదు కదా" అంటూ సమాధాన మిచ్చాడు.

దూరంగా కొండలమాటున లోనికి మెల్లిగా జారు కుంటున్నాడు సూరీడు.

చల్లగాలికి రివ్వున సాగిపోతోన్న బస్సు తిరుగుతున్న మలుపులకు ఆమె కిరణ్ వంటిని బాగా రాసుకుంటోంది. అతను మాత్రం చలించలేదు సరికదా! తర్వాత ఆమెవైపు కూడా కన్నెత్తి చూడలేదు.

మలుపులూ, అదుర్లూ లేకపోయినా ఆమె శరీరం అతని శరీరాన్ని తగులుతోంది. ఒక్కోసారి చిన్న చిన్న కుదుపులక్కూడా మీదపడుతోంది. అది గమనించి ఆమె వైపు చూశాడు కిరణ్.

'ఎంతవారలయినా కాంతదాసులే' అనుకుంది.

అరమోడ్పు కన్నులతో సైగతో కూడి, చిలిపిగా కవ్వించిన ఆమె చూపులను అర్థం చేసుకోలేని పసిపిల్లాడు కాదు కిరణ్.

కొద్దిగా జరిగాడు. అతడు జరిగే కొద్దీ ఆమె రెచ్చగొట్టేట్లు కవ్విస్తూ అతనివైపు జరుగుతోంది. అతను కొద్ది కొద్దిగా కుంచించుకుపోతూ కూర్చున్నాడు.

'అప్పటికి చీకటి పడటం, లైట్స్ ఆర్పివేయటంతో సరిపోయింది లేకుంటే అందరూ ఇటుచూసేవారే అమ్మో' అనుకున్నాడు కిరణ్.

అంతలోనే ఆమె "వస్తారా! వచ్చేస్టేజీలో దిగిపోయి ఎంజాయ్ చేద్దాం" అంది తమకంతో.

అంత వరకూ ఉన్న అతనిలోని సహనం చచ్చిపోయింది.

"యూ... షటప్! నీ కంటికి నేనెలా కన్పిస్తున్నాను. ముందు నుంచి చూస్తున్నాను హద్దు మీరుతున్నావు. మీకూ పెళ్ళి కావల్సి ఉంది. మిమ్మల్ని చేసుకోబోయేవాడు గుణవతీ, శీలవతీ కావాలనుకుం టాడు - తుచ్ఛమైన క్షణికమైన సుఖంకోసం అడ్డదార్లు తొక్కడానికి మీకు సిగ్గులేదూ! ఛ... నాగరికత ఎటు వెళుతోందో అర్థం కావటం లేదు" అన్నాడు కోపంగా కిరణ్.

ఆమె మౌనంగా కూర్చుండిపోయింది!

★ ★ ★

నీకు ఉత్తరం వచ్చిందంటూ తల్లి తెచ్చి ఇచ్చిన లెటర్‌ని చించిచదివాడు.

ప్రియమైన కిరణ్ గార్కి...

ఇపుడు నాకు ప్రియమైనారు కాబట్టి ప్రియమైన అని సంభోదించటంలో తప్పులేదనుకుంటాను. మొన్న బస్సులో మీ సంస్కారాన్నీ వ్యక్తిత్వాన్నీ పరిశీలించాను. నేను చూపిన చొరవకు ఇంకొకరైతే బస్సులోనే... ప్రొసీడ్ అయ్యేవారు. యూ ఆర్ గ్రేట్...

నేను యూనివర్శిటిలో ఉండగా మా నాన్న "నీకో సంబంధం చూశాను. నువ్వు ఒప్పుకుంటే పెళ్ళిచూపులకి రమ్మని వాళ్ళకిచెబుతాను" అంటూ వెనుక అడ్రస్ ఉండే మీ ఫొటో కూడా పంపించారు. ఫొటో చూడగానే మీరు నచ్చారు. అదే చెప్పడానికి వస్తుండగా మీరు బస్సులో కన్పించారు. మిమ్మల్ని పరీక్షించదలిచాను - పరీక్షించాను. అందులో మీరు నెగ్గారు. ఐయామ్ వెరీహ్యాపీ, ఇక మీరు ఒప్పుకుంటె అర్ధాంగినే.

ఇట్లు

'బస్సులో బరితెగించిన బ్యూటీ'

సుస్మిత వదన

'నిశ్చితార్థం పెట్టుకుందామని' కబురం పాడు శ్రీ కిరణ్.

మారగాని రాంబాబు
1-257, భవానీపేట,
పులివెందుల, కడప జిల్లా